# రిటైర్‌మెంట్

మంగపతిరావు రాత్రి ఏడున్నర గంటలకి, మెడలో పూలదండ, చేతిలో మిఠాయిల ప్యాకెట్టు, అడుగున్నర ఎత్తున్న వాటర్‌ఫిల్టర్‌తో ఇంటిముందు రిక్షా దిగాడు.

అందాకా అక్కడే కూర్చుని భర్త రాకకోసం ఎదురుచూసిన వర్ధనమ్మ అంతక్రితమే లోపలికెళ్ళి నడుం వాల్చింది.

"ఇదిగో వర్ధనం" అంటూ హడావిడిగా, ఆనందంతో కలిసిన ఉద్రేకంతో పిలిచాడు మంగపతి.

వర్ధనమ్మ చటుక్కున లేచి భర్తకి ఎదురెళ్ళి అతన్ని చూసి ఒక్కక్షణం నివ్వెరపోయి అంతలోనే సర్దుకుంది.

మంగపతి తన చేతుల్లోని బరువునంతా భార్యకిచ్చి రిక్షాలోవున్న వాటర్ ఫిల్టర్ తెచ్చేందుకు బయటకెళ్తుంటే అతని మెడలో కొండచిలువలా కదులుతున్న పూలదండ చూసి కొంచెం నవ్వుకుంది వర్ధనమ్మ.

"అయిపోయిందే వర్దనం. ఈరోజుతో 33 ఏళ్ళ ఉద్యోగ జీవితానికి స్వస్తి చెప్పడం అయిపోయింది" ఆయాసంగా, ఆనందంగా బొజ్జ ఊపుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు మంగపతి.

"ఓహో ఏం పార్టీ చేశారు! ఎంత సంబరం చేశారు!! చూడూ ఈ జెర్రె పోతులాంటి పూలదండ చూడు. నువ్వేమన్నాసరే నాకి దలద మెడలోంచి తియ్య బుద్ధవలేదు."

"మా స్టాఫంతా కలిసి సుమారు నూట యాభై మంది. గ్రాండ్ ఫేర్‌వెల్ ఇదిగో ఈ స్వీట్లు, ఈ వాటర్ ఫిల్టర్ గుర్తుగా రోజూ వాళ్ళని తల్చుకోవాలిట."

వర్దనమ్మ మునివేళ్ళతో తాకింది తళతళలాడే వాటర్‌ఫిల్టర్‌ని.

శుభ్రంగా తీసి చూడవే. రేపటినుంచి దాన్నిండా నీళ్ళుపోసిపెట్టు. మంచి నీళ్ళకి ఇంక సమస్యే వుండదు."

వర్దనమ్మ సంతోషంగా దాన్నితీసి అటూ ఇటూ తిప్పి చూసి ఎంతో సంబర పడిపోయింది.

ఆ రోజు మంగపతి రిటైరైపోయాడు.

మంగపతికి కాస్త బెంగగా అనిపించినా ఆనందమే ఎక్కువగా వుంది. ఎందుకంటే పొద్దుటినుంచి సాయంత్రందాకా ఆఫీసరడిగే అడ్డమైన ప్రశ్నలకి సమాధానం చెప్పనవసరంలేదు. అదీ ఆనందం.

* * *

ఉదయం లేవగానే వర్దనమ్మ ఓపిక చేసుకుని భర్తకి పెసరట్లువేసి పెట్టింది. అతను మహదానందపడిపోతూ తిన్నాడు.

"చూడు వర్దనం. ఇలా హాయిగా పెసరట్లు తినడానికి ఎప్పుడూ కుదిరి చావ లేదు. ఏదీ ?? తొమ్మిది గంటలవకుండానే రెండు మెతుకులు నోట్లో వేసుకుని ఆఫీసుకి తగలడాల్సి వచ్చేది" వేడి చల్లారకుండా వూదుకుంటూ తిన్నాడు మంగ పతి.

యాభై అయిదేళ్ళ వర్దనమ్మ అయిదేళ్ళుగా అడపాతడపా అనారోగ్యంతో బాధపడుతూనే వుంది. కీళ్ళవాతంవల్ల కూర్చుంటే లేవడం, లేస్తే కూర్చోవడం బాధాకరంగా వుందామెకి. చెయ్యాల్సింది ఇద్దరికే అయినా ఇంటిపని ఒక్కొక్క సారి భారమై పోతుందామెకి.

ఇంతవరకూ ఆమె ఉదయం లేవంగానే ఓపికనంతా కూడదీసుకుని కాఫీ చేసి వంటచేసి భర్తకిపెట్టి అతన్ని ఆఫీసుకి పంపి తను విశ్రాంతిగా వుండేది. మళ్లీ రాత్రి పనికి ఓపిక సమకూర్చుకునేది. కానీ ఇప్పుడామె దినచర్య అకస్మాత్తుగా మారిపోయింది.

మంగపతి అటూ ఇటూ తిరిగి పేపరు చదివి పంచాంగం తిరగేసి పావు తక్కువ పన్నెండు గంటలకి స్నానానికి లేచాడు.

వర్ధనమ్మ అన్నీ అమర్చింది. ఒంటిగంటకి భోజనంచేసి విశ్రమించాడు మంగపతి. అవునుమరి అతను ఉద్యోగం చేసి చేసి రిటైరయ్యాడు.

వర్ధనమ్మ అన్నీ సర్దుకుని నడుం వాల్చేసరికి సుమారు రెండు గంటల దాటింది. ఆమె చాపమీద వొరిగి అయిదు నిముషాలయిందో లేదో మంగపతి గంట నిద్ర పూర్తిచేసి లేచాడు.

"వర్ధనం కాస్త టీ పెట్టు" అన్నాడు లేస్తూనే.

ఆమె మారుమాట్లాడలేకపోయింది. కాళ్ళు స్వాధీనం కాకపోయినా ఎలాగో లాగ లేచి టీ పెట్టింది.

మూడున్నర గంటలవుతుంటే –

"వర్ధనం వేడివేడిగా కాసిన్ని పకోడీలు చేద్దూ" అన్నాడు.

వర్ధనమ్మ వంటింట్లోకి అడుగుపెట్టింది. పకోడీలు తింటూ "ఇలా కొన్నాళ్ళు హాయిగా ఏ బాధ్యతా బరువు లేకుండా ఈ టైముకిది చెయ్యాలని నియమం లేకుండా వుండాలని ఎప్పటినుంచో కోరిక" అన్నాడు మంగపతి.

వర్ధనమ్మేం మాట్లాడలేదు.

* * *

"ఏమే ఏదైనా చెయ్యమంటే అలా ఏడుపు ముఖం పెడతావేం? ఇన్నేళ్ళూ ఉద్యోగంలోపడి క్షణం సుఖం లేకుండా వున్నాను. ఇప్పుడేకదా కాస్త తీరిగ్గా వున్నదీ."

అవును మరి. అతను ఉద్యోగంచేసి అలసిపోయి రిటైరయి వున్నాడు

వర్ధనమ్మ దినచర్య పూర్తిగా మారిపోయింది వారంరోజులో తెల్లవారి లేస్తూనే టిఫిన్, కాఫీ చెయ్యాలి. అదీ రోజుకొక రకం. పన్నెండుకో, ఒంటిగంటకో భోజనం ఏర్పాటు చేయాలి. అదీ నాలుగు రకాల నవకాయ రుచులతో, మూడు

గంటలకి టీ పెడితే అయిదు గంటలకి కరకరలాడుతూ ఏదో తినాలని వుంటుంది మంగపతికి.

మరీ ఇంట్లోనే అయిపోతోందని పార్కుదాకా షికారు కెళ్ళివస్తే రాత్రి కాళ్లు లాగుతాయి.

"ఇదిగో వర్ధనం కాస్త ఈ పాదాలమీద నీ చెయ్యి వేద్దూ" అమ్మయ్య చల్లని నీ చెయ్యి నొప్పి ఇట్టే లాగేస్తుంది."

అకస్మాత్తుగా మారిన అలవాట్లువల్ల మంగపతిరావు. మూడురోజులు అనారోగ్యంవల్ల మూలపడ్డాడు. ముక్కులు మూలుగులు. అతను మళ్ళీ మామూలుగా అయ్యేసరికి రాత్రి నిద్రలేక, పగలు విశ్రాంతిలేక వర్ధనమ్మ నీరసపడిపోయింది.

*　　　*　　　*

ఆ రోజు మంగపతి ఆఫీసులో రావలసిన డబ్బులు వసూలు చేసుకువేందుకు వెళ్ళాడు.

కోయవాడు వద్దన్నా వినకుండా వర్ధనమ్మని నిలబెట్టి మరీ జోస్యం చెప్పాడు.

"భూదేవంత సహనం, మూడుకాళ్ళతో నడుస్తూ కూడా భర్తసేవ చేసుకుంటావు. అబ్బో ఎనభై ఏళ్ళ ఆయువుంది. పునిస్త్రీగా ఎల్లిపోతావు."

లోపలికొచ్చి వర్ధనమ్మ వంటరిగా చాపేసుకుని పడుకుంది. మధ్యాహ్నపు మగత నిద్రలో వర్ధనమ్మ వేరే లోకానికి ఎక్కడికో ప్రయాణమైంది. ఎవరెవరో ఎదురవుతున్నారు. కనిపించిన ప్రతివాళ్ళనీ ఆశగా ఆర్తిగా అడుగుతోంది.

"అయ్యా నాకూ రిటైర్‌మెంట్ కావాలి. నేనేం చేస్తే నాకది లభిస్తుంది? ఇరవయ్యో ఏట ఈ పనిభారం స్వీకరించాను. కష్టాలు పడ్డాను. కాన్పులు కన్నాను. బిడ్డల్ని పెంచాను. రోగాలనీ రొస్టులని నా వళ్ళు గుల్ల చేసుకుని అందరికీ ఆయువు పోసాను. పిల్లలు పెద్దవాళ్ళయి వారి బతుకు వారు బతుకుతున్నారు. అమ్మ గురించే ఆలోచించే తీరికెక్కడిది వారికి పాపం.

కానీ,

ఈ అరిగిన కాళ్ళతో చెదిరిన శక్తితో మందగించిన దృష్టితో నేను సేవలు చేయలేకపోతున్నాను. నేనీ పాతివ్రత్య ధర్మాన్ని నిర్వర్తించలేకపోతున్నాను.

అయ్యా నువ్వెవరు?

ఇంద్రుడివా? చంద్రుడివా? మహావిష్ణువివా? పరమశివుడివా? ఎవరికి నేను అర్జీ పెట్టుకోవాలో చెప్పు నాయనా? నాకూ ఉద్యోగ విరమణ కావాలి.

10-1-92 — (ఆంధ్రభూమి)